జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుండి 4గురు ఎంపిక

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో ఈనెల 14 నుండి 18 వరకు జరుగు అస్మిత ఫెన్సింగ్ లీగ్ 2024- 25 జాతీయస్థాయి పోటీలకు విజయనగరం జిల్లా నుండి నలుగురు ఫెన్సింగ్ క్రీడాకారులు కే .అప్పలరాజు, జి. రాధా, కే పవన్ కుమార్, వై ప్రవళిక పాల్గొంటున్నారని జిల్లా ఫెన్సింగ్ ముఖ్య శిక్షకులు డి.వి.చారి అన్నారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా డిఎస్డివో వెంకటేశ్వరరావు క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ జాతీయస్థాయిలో పథకాలు తేవాలని ఆకాంక్షించారు. ఈ నలుగురు క్రీడాకారులు విజయనగరం ఫెన్సింగ్ ముఖ్య శిక్షకులు డివి చారి వద్ద శిక్షణ తీసుకుంటున్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల : స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ బి.సుదర్శన్‌రావు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా కార్యాలయానికి వచ్చిన వారికోసం ఈ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. వేసవి వేడి దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు మంచినీరు తాగడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్‌లు రవిశంకర్, వివిఆర్ జగన్నాథరావు, సత్యనారాయణ, మండల సర్వేయర్ టి.దివ్య మానస, పారసం మాజీ సర్పంచ్ తర్లాడ శంకరరావు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్స్‌లో సత్తా చాటిన శ్రీ లక్ష్మీ గణపతి విద్యార్థులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విజ్జి స్టేడియంలో ఇటీవల జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించగా. ఈ పోటీలో ఉత్తరాంధ్రకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు 900 మంది పాల్గొన్నారు పట్నంలో కేఎల్ పురం లో గల శ్రీ లక్ష్మీ గణపతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు 42 మెడల్స్, గోల్డ్, సిల్వర్, బ్రాంజ్)తో ఉత్తరాంధ్రలో ద్వితీయ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ జి పద్మజారాజు తెలియజేశారు. నిరంతరం పాఠశాలలో విద్యతోపాటు క్రీడలకు కూడా ఉత్తమ తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

కాల్వలో గల్లంతైన శైనీ మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-వంగర : మద్దువలస కుడికాలువలో గల్లంతైన శైనీ మృతదేహంను గుర్తించారు. బుధవారం మద్దువ వలస కుడి కాల్వ పోలీసులు లింపు చేపట్టగా ఉదయం లభ్యమైంది. ఈమేరకు ఎస్ ఐ షేక్ శంకర్ ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ రోజు ఉదయం కుడి ప్రధాన మంగళ వారం నాడు కాల్వలో తల్లీ ఇరువురు పిల్లలు దూకిన ప్రదేశానికి చెరువలోనే శవాన్ని కనిగొన్నారని వివరించారు. మంగళవారం సాయంకాలం ఇద్దరు పిల్లలతో సహా కళింగ శ్రావణి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. ఈ ఆత్మహత్యా ప్రయత్నంలో శ్రావణి, కుమారుడు సిద్దును కాపాడిన విషయం తెలిసిందే. గల్లంతైన శ్రావణి కుమార్తె శైనీని పోలీసులు గుర్తించి శవాన్ని పోస్టుమార్టం కోసం రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అయిన మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నిరుపేద కుటుంబానికి ఆంధ్ర ఎస్సై సీతారాం చేయూత

ఆంధ్ర ఎస్సై సీతారాంకి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర- మెంటాడ : మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండ లింగాలవలస పంచాయతీకి చెందిన మధుర గిరిజన గ్రామానికి చెందిన పాడి లక్ష్మణరావు గత జనవరి నెలలో అనారోగ్యంతో మరణించటంతో భార్యలక్ష్మి, ముగ్గురు ఆడబిడ్డలను చదివించడం లోనూ, సాకటంలోనూ ఇబ్బంది ఎదుర్కొంటుండగా మూర్తి భవించిన మానవత్వంతో నేనున్నానంటూ భరోసా తో ఆంధ్ర ఎస్సై కే సీతారాం వచ్చి వారి కుటుంబాన్ని దర్శించి ధైర్యం చెప్పి తన వంతు సహాయంగా 5000 రూపాయలు నగదును కుటుంబానికి అవసరమైన నిత్యవసర సరుకులను అందజేసి మరొక్కసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటికే అనేక గిరిజన గ్రామాలలో చట్టాలపై అవగాహన కల్పిస్తూ వారి పరిస్థితులను తెలుసుకుంటూ వారికి చేయూతనిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని బట్టి మండలంలో ఆయనకు ఎంతోమంది అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. నా కష్టాన్ని నా ఇబ్బందులను గుర్తెరిగి నా బిడ్డలు చదువుకై, నా కుటుంబ పోషణకై ఎంతో సహాయం చేసిన ఆంధ్ర ఎస్సైకి బాధితురాలు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో కాంస్యంతో మెరిసిన లలిత

జిల్లాకు గర్వకారణం పారా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దయానంద్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : న్యూ ఢిల్లీ వేదికగా ప్రారంభమైన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ 2025 పోటీల్లో తొలిరోజు టి11 విభాగం 1500 మీటర్ల పరుగు పందెంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారిణి కిల్లక లలిత కాంస్య పతకం గెలుచుకోవడం జిల్లాకు గర్వకారణమని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 20 దేశాలకు చెందిన పారా క్రీడాకారులు పాల్గొన్నారని, గట్టి పోటీలో సైతం అసామాన్య ప్రతిభ కనబరచిన లలిత తానేంటో నిరూపించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో విజయనగరం పేరు మారుమోగేలా చేసిందని ప్రశంసించారు. ఈ పతకం మన రాష్ట్ర క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహన్ని నింపిందని, ఇతర విభాగాల్లోనూ ఆమె పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన లలితకు జిల్లా కలెక్టర్ డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు లు అభినందనలు తెలియజేసారు.

ప్రతీ రైతుకు భూ ఆధార్ తప్పనిసరి

సంతపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ విజయ

విశాలాంధ్ర-కొత్తవలస : ప్రతీ రైతు తప్పనిసరిగా భూ ఆధార్ అనగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలు పొందాలంటే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని కొత్తవలస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.విజయ తెలిపారు. మండల వ్యవసాయ అధికారిణి మాధురిశరణ్య ఆధ్వర్యంలో బుధవారం సంతపాలెం గ్రామంలో గల రైతు సేవా కేంద్రం పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఎడి పాల్గొని మాట్లాడారు. రబీ ఈ పంట నమోదు వివరాలు సామజిక తనిఖీ కోసం అన్ని రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందని ఏమైనా వివరాలు తప్పుగా నమోదు జరిగి ఉంటే రైతు సేవా కేంద్రం నందు తెలియచేస్తే సరిచేస్తారని తెలియచేసారు. గ్రామంలో సాగవుతున్న వివిధ పంటలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కే.హేమ, ఎన్.దుర్గారావు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై 64 సిసి కెమెరాలు : కలెక్టర్

10 హిట్ అండ్ రన్ కేసులకు కమిటీ ఆమోదం

విశాలాంధ్ర -విజయనగరం:రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, కారణాలను గుర్తించేందుకు జాతీయ రహదారిపై 64 సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. హిట్ అండ్ రన్ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం జరిగింది. విజయనగరం డివిజన్‌లో గుర్తుతెలియని వాహనాలు ఢీకొని మృతిచెందిన, క్షతగాత్రులుగా మారిన మొత్తం 10 కేసులపై సమగ్రంగా చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హిట్ అండ్ రన్‌కు సంబంధించిన కేసులు ఏవీ పెండింగ్లో లేకుండా వెంటవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే సమావేశం నాటికి మొత్తం పెండింగ్ కేసులన్నిటినీ పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో మొత్తం 34 కిలోమీటర్ల మేర ఉన్న 16వ జాతీయ రహదారిపై 64 సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రూ.5లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. వీటిని అమర్చే పని వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లు, నేరాలు జరిగే చోట్లను దశలవారీగా అన్నిచోట్లా సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికోసం సమగ్ర సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్‌పి సౌమ్యలత, ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, డిటిఓ మణికుమార్, డిఎంఅండ్‌హెచ్‌ఓ జీవనరాణి, ఆర్‌డిఓలు, డిఎస్‌పిలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని, విద్యాశాఖామంత్రిని కలిసిన ఎమ్మెల్సీ గ్రీష్మ

విశాలాంధ్ర-వంగర : ఎంఎల్‌సీ కావలి గ్రీష్మ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, రాష్ట్ర ఐటీ విద్యాశాఖామంత్రి లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఆమె చంద్రబాబునాయుడు కార్యాలయానికి వెళ్లి ఆయన్ని కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు. అదేవిదంగా ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కార్యాలయంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. గ్రీష్మకు ఎస్సీ యువత కోటాలో ఎంఎల్‌సీగా అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. కావలి గ్రీష్మ ఎమ్మెల్సీ ఇస్తారనే చర్చ నామమాత్రంగా కూడా పార్టీలో లేదు. కానీ ఆమె పేరును ఎవరూ ఊహించని విధంగా ఖరారు చేసింది పార్టీ అధిష్టానం. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో పాటు, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె కావడం ఆమెకు కలిసి వచ్చిన అంశం. అలాగే నాడు శ్రీకాకుళం జిల్లా, నేడు విజయనగరం జిల్లా రాజాంలో ఉన్న పరిస్థితులు కూడా గ్రీష్మకు ఎమ్మెల్సీ స్థానం దక్కేలా చేశాయి. రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీ వ్యవహార శైలిపై కొన్ని కంప్లైంట్లు ఉన్నాయని తెలిసింది. గత ఎన్నికల్లో రాజాం స్థానం కోసం కొండ్రు మురళీతోపాటుకావలి గ్రీష్మ కూడా పోటీ పడ్డారు. కానీ అప్పట్లో ఆ స్థానాన్ని కొండ్రురు మురళీకే కేటాయించింది అధిష్టానం. ఇప్పుడు అక్కడ పరిస్థితులను బేరీజు వేసుకుని అన్ని కోణాల్లో ఆలోచన చేసిన మీదట గ్రీష్మకు ఎమ్మెల్సీ స్థానం కట్టబెట్టారనేది ఓ చర్చ. ఇక ఈమెకు లోకేష్ టీం మెంబరుగా పేరు ఉంది. గతంలో ఓ మహానాడులో గ్రీష్మ స్పీచ్ తెలుగుదేశం కార్యకర్తలను ఉర్రూతులూగించింది. 2014లో టీడీపీ గెలిచిన తరువాత పార్టీలో గ్రీష్మ క్రియాశీలకంగా వ్యవహరించారు.

హనుమాన్ చాలీసా పఠనంలో ప్రపంచ రికార్డు



విశాలాంధ్ర-విజయనగరం : నగరానికి చెందిన జయ పవన్‌కళ్యాణ్ హనుమాన్ చాలీసా పఠించడంలో ప్రపంచ రికార్డు సృష్టించారు. 55 సెకండ్లలో హనుమాన్ చాలీసా ను పూర్తిగా పఠించినందుకు గాను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. ఈ మధ్య జరిగిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీలలో ఆయన పాల్గొని, హనుమాన్ చాలీసా ను అతి తక్కువ నిడివిలో పూర్తిగా పఠించిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. గతంలో బీహార్ కు చెందిన అబ్బాయి 59 సెకండ్లలో హనుమాన్ చాలీసా పఠించగా ప్రస్తుతం ఆ రికార్డును తిరగరాసి 55 సెకండ్లలో హనుమాన్ చాలీసా ను పఠించడం గొప్ప విషయం గా చెప్పవచ్చు. విజయనగరం నగరపాలక సంస్థ లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న తాతబాబు కుమారుడే జయ పవన్ కళ్యాణ్. అయితే ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించడంతో జయ పవన్ కళ్యాణ్ కు అందరూ అభినందనలు తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేసిన జయ పవన్ కళ్యాణ్ అత్యంత సృజనను కనపరిచి ఈ రికార్డును సొంతం చేసుకోవడం విశేషం. ఈ మేరకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ వారు యూట్యూబ్, ఫేస్ బుక్, ట్విట్టర్ వంటి అనేక సామాజిక మాధ్యమాలలో జయ పవన్ కళ్యాణ్ సాధించిన రికార్డును నిక్షిప్తం చేశారు. దీంతో ఈ విషయం ప్రస్తుతం వైరల్ అవుతుంది.

అట్టాడలో అగ్ని ప్రమాదం : 7లక్షల వరకు ఆస్థి నష్టం

విశాలాంధ్ర-జామి : మండలంలోని అట్టాడ గ్రామంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభంవించింది. ఈప్రమాదంలో దాదాపు రూ.7లక్షల వరకు ఆస్థినష్టం ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామశివారులో ఉన్న పొటుపురెడ్డి వారి కళ్ళాలలో రాత్రి 11గంటల సమయంలో అగ్ని కీలలు రావడం స్థానికులు గమనించారు. వెంటనే అందరూ పరుగున వెళ్ళి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.అగ్ని మాపక వాహనానికి సమాచారం అందించగా వాహనం వచ్చే లోపు మంటలు తీవ్ర రూపం దాల్చాయి. ఈప్రమాదంలో పొటుపురెడ్డి నారితల్లి, శ్రీను, నారికృష్ణ, సీతబాబు, రామునాయుడు, అప్పారావులకు చెందిన పశువుల శాలలు పూర్తిగా కాలి భూడిదయ్యాయి. వీటితో పాటు పాకలలో ఉన్న 6 పశువులు, రెండు నాటుబళ్ళు, 2 పెద్ద గడ్డి మేట్లు కాలపోయాయి. అగ్ని మాపక వాహనం సిబ్బంది మంటలను కష్టపడి మంటలను ఆర్పగలిగారు. బాధితులను మండల టీడీపీ నేతలు పోలివర్తి స్వామినాయుడు, కొత్తలి సూర్యారావు, దనియాల పైడిరాజుతోపాటు స్థానిక నేతలు పరామర్శించారు. గ్రామ సర్పంచ్ అట్టాడ అమ్మన్నదొర సహాయ కార్యక్రమాలను చేపట్టారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరిగేందుకు గల కారణాలను తెలుసుకుంటున్నారు.

పామాయిల్ రైతులను ఓఈఆర్‌కు రూ.20 వేలు ధర ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్యే బేబీనాయన



విశాలాంధ్ర-బొబ్బిలి : అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) పామాయిల్ రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1986లో పెదవేగి గ్రామంలో రెండున్నర ఎకరాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన పామాయిల్ పంట ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెంది ఎందరో రైతులకు ప్రధాన పంటగా మారిందన్నారు. 1990లో భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న బయోటెక్నాలజీ డిపార్ట్మెంట్ వారి లెక్కల ప్రకారం సుమారు 1,12,000 కోట్ల రూపాయల విలువైన వంట నూనె దిగుమతి చేస్తున్నట్లు తెలిసి, ప్రభుత్వం పామాయిల్ వంటను ప్రోత్సహించే విధంగా రైతులకు సబ్సిడీ, మద్దతు ధరలు కల్పించారని తెలిపారు. మన విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు రెండున్నర లక్షల హెక్టార్లలో ఈ పామాయిల్ పంట ఉన్నదని, సుమారు రెండు లక్షల మంది రైతులు, పది లక్షల మంది వ్యవసాయ కూలీలు ఆధారపడి ఉన్న పామాయిల్ పంటకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరించాలని కోరారు. 2017లో ఒక టన్ను పామాయిల్ పండిం చేందుకు ఖర్చు పది వేల రూపాయలు ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని, పలుకారణాల వలన ఖర్చులు పెరగడంతో ఆ ధర గిట్టుబాటు అయ్యే పరిస్థితి ఇప్పుడు లేదని ప్రభుత్వం అందుకోవాలని అన్నారు. రైతుల అభ్యర్థన మేరకు తెలంగాణలో ఉన్న ఒక 5 పామాయిల్ ఫ్యాక్టరీలకు 200 టన్నులు చప్పున అమ్ముకునే విధంగా 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవకాశం కల్పించారని తెలిపారు. ఏపీ నూతన అయిల్యా ఫీడ్ పాక్టరీ ఏర్పడి, ఓఈఆర్ పెరిగినంతవరకు తెలంగాణ ఫ్యాక్టరీలు ఓఈఆర్ ఆధారంగా ఇచ్చే ధరను మన రైతులకు ఇవ్వాలని కోరారు..లేనియెడల, నూతనంగా నిర్మించిన ప్రైవేటు పామాయిల్ ఫ్యాక్టరీలలో అధిక ఓఈఆర్ ఆధారంగా ఇవ్వాలని, కనీస మద్దతుధర రూ20 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దింతో పామాయిల్ రైతులు ఎమ్మెల్యే బేబీ నాయన కు హర్షం వ్యక్తం చేశారు.

సీతం కళాశాలలో నూతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ (కంప్యూటర్ సైన్స్), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ మరియు ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ్ విభాగాలు ఆధ్వర్యంలో ఏ ఆర్వి ఆర్ (అగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చ్యువల్ రియాలిటీ) కంప్యూటర్ ల్యాబ్‌ను కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ డాక్టర్ బొత్స ఝాన్సీ ప్రారంభించారు. ప్రారంభోపన్యాసంగా అగ్‌మెంటెడ్ రియాలిటీ అనేది ఒక భౌతిక, వాస్తవ ప్రపంచ పర్యావరణం ఒక ప్రత్యక్షప్రసార దర్శకత్వం లేదా పరోక్ష వీక్షణ సాంకేతికత దీని అంశాలు ధ్వని, వీడియో, గ్రాఫిక్స్ లేదా జీపిఎస్ డేటా వంటి కంప్యూటర్ - జెనరేటెడ్ సెన్సారి ఇన్‌పుట్ ద్వారా అభివృద్ధిచేయబడతాయి వర్చ్యువల్ రియాలిటీ సాంకేతికతో మనిషి చూసే వాస్తవ దృశ్యాన్ని పూర్తిగా కంప్యూటర్ ద్వారా కల్పిత దృశ్యంతో భర్తీ చేస్తుందని చెప్పారు దీనిని ప్రతి ఒక్క విద్యార్థి చక్కగా ఉపయోగించుకోవాలని కోరారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణరావు మాట్లాడుతూ మీలో ప్రతి ఒక్కరూ కొత్త టెక్నాలజీలను నేర్చుకోవాలనే మీ ఉత్సాహం ప్రపంచంలో మీకు అనేక తలుపులు తెరుస్తుందనడంలో సందేహం లేదని విద్యార్థులను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి రామ మూర్తి మాట్లాడుతూ భవిష్యత్ సవాళ్లను స్వీకరించడానికి ఏ ఆర్ వి ఆర్ ఒక మార్గం అని సంసి ద్ధతను ప్రతిబింబిస్తుందని, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల అంకితభావానికి వారి నిరంతర వృద్ధి, విజయం కోసం ఎదురు చూస్తున్నందుకు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో కృత్రిమ మేధస్సు మరియు డేటా సైన్స్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ మరియు ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ విభాగాధిపతులు డా.రాధ, డాక్టర్ జి వేణు మాధవరావు, డాక్టర్ టీ దామోదరనాయుడు రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డీన్ డాక్టర్ ప్రసన్న, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ నరేంద్ర వై నరేంద్ర, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో మహిళ సాధికారతపై ప్రసంగించిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి

విశాలాంధ్ర-డెంకాడ/భోగాపురం : నెల్లిమర్ల నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే లోకం నాగమాధవినేడు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మహిళా సాధికారత అంశంపై ప్రాముఖ్యత కలిగిన ప్రసంగాన్ని చేశారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ప్రసంగం సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'మనం డ్వాక్రా గ్రూప్స్ ద్వారా మహిళా ఉమెన్ ఎంటర్ప్రైజెస్ ను ప్రోత్సహించినప్పటికీ, ఇంకా కొంతమంది మహిళలు అభివృద్ధి చెందడం లేదు. వారికి చేయూత అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలి" అని అభిప్రాయపడ్డారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఆమె పలు ప్రతిపాదనలు చేశారు. ఆమె ప్రతిపాదించిన ఉపాధి మార్గాలు, టెక్స్టైల్ బాక్స్, ఫోటో స్టూడియోస్, ఇంటిగ్రేటెడ్ వెజిటబుల్ ఫార్మింగ్, పెరటి కోళ్ల పెంపకం వంటి వ్యాపారాలను మహిళలు ప్రారంభించవచ్చని, వీటి ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా, భయపడకుండా స్వయం సమృద్ధి సాధించగలుగుతారని ఆమె అభిప్రాయపడ్డారు. "మేము అధికారం కోసం కోరడం లేదుబీ సమానత్వం కోసం కృషి చేస్తున్నాం. ప్రస్తుతం మహిళా సాధికారత 33% ఉన్నప్పటికీ, అన్ని రంగాల్లో ఇది 50%కి చేరాలి" అని ఆమె స్పష్టం చేశారు. మహిళల వ్యక్తిగత అభివృద్ధి, ఆరోగ్యం, విద్య మరియు ఆర్థిక పురోగతికి తన వంతు కృషిని కొనసాగిస్తానని ఆమె హామీ ఇచ్చారు. అలాగే, ఆమె రాష్ట్ర అసెంబ్లీలో కొన్ని అభ్యర్థనలు కూడా ప్రవేశపెట్టారు. పూసపాటిరేగ మండలానికి మోడల్ స్కూలు మరియు భోగాపురం మండలానికి జూనియర్ కాలేజి ఏర్పాటు చేయాలని ఆమె విద్యాశాఖ మంత్రి లోకేష్‌ని కోరారు. విశాఖపట్నం-భోగాపురం ఐటీ కారిడార్‌లో కొత్త వ్యాపారవేత్తలకు ఆధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఐటీ శాఖ మంత్రిని ఆమె అభ్యర్థించారు. ప్రాంత అభివృద్ధి దృష్ట్యా, లోకం నాగ మాధవి, స్థానిక కర్మాగారాలను దృష్టిలో ఉంచుకుని, యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే స్థానికంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆకాం క్షించారు. ఈ అభ్యర్థనలు అన్ని ప్రాంత అభివృద్ధి కోసం చాలా ముఖ్యమైనవి, అని ఆమె తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు మెరుగైన విద్యను పొందడమే కాకుండా, ఉపాధి అవకాశాలను కూడా సృష్టించగలుగుతారని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా, ఐటీ కారిడార్‌లో ఏర్పడే మౌలిక సదుపాయాలు పరిశ్రమ లకు కొత్త అవకాశాలను తెరవడమే కాకుండా, యువతకు మరింత ఉపాధి అవకాశాలను అందిస్తాయని ఆమె నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుతో స్థానిక యువతకు అవసరమైన శిక్షణను అందించడమే కాకుండా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందిన కార్మిక శక్తిని తయారుచేసే అవకాశం ఉంటుందని ఆమె చెప్పారు. ఈఅభ్యర్థనలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటుందని ఆమె ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విజయవంతంగా 'యువత పోరు'

కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ నాయకుల మండిపాటు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అధికారమే పరమావధిగా సార్వత్రిక ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని హమీలు ఇచ్చి యువతను, విద్యార్థులను వంచన గురి చేస్తోన్న కూటమి ప్రభుత్వంపై యువాగ్రహం వెల్లువెత్తింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు బుధవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన యువత పోరు కార్యక్రమం విజయవంతమైంది. జెడ్పీ ఛైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ శాసనసభ్యులు శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలె రాజేష్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని 9 నెలల కూటమి ప్రభుత్వ పాలనపై మండిపడ్డారు. ముందుగా విజయనగరంలోని కంటోన్మెంట్ మున్సిపల్ పార్కు నుంచి ర్యాలీగా బయలుదేరిన పార్టీ శ్రేణులు, యువత జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హమీలను ప్లకార్డులపై ప్రదర్శిస్తూ వాటిని తక్షణమే అమలుచేయాలంటూ నినదించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లడుతూ 9 నెలల కూటమి ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు జరిగిన అన్యాయంపై పోరాటం చేయటంతో పాటు పెంచిన విద్యుత్ ఛార్జీలపై నిలదీయటం జరిగిందన్నారు. తాజాగా విద్యార్థులు, యువతకు ఎన్నికలకు ముందు ప్రకటించిన మోసకారి హమీలు అమలుచేయటంపై ప్రజలకు తెలియజెప్పటంతో పాటు ప్రభుత్వాన్ని నిలదీయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయికుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, వెలమ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, మాజీ జిల్లా కార్యదర్శి కెవి సూర్యనారాయణరాజు, విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ నాయకులు శోభా హైమావతి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ శోభా స్వాతీరాణి, వివిధ మండలాలకు చెందిన జెట్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

70 కిలోల 100 గ్రా. గంజాయి పట్టివేత : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం జిల్లా ఎస్.కోట పోలీసు స్టేషను పరిధిలోని బొడ్డవర చెక్ పోస్టు వద్ద పోలీసులు మార్చి 12న పక్కా సమాచారంతో వాహన తనిఖీలు చేపట్టి, 70.100కిలోల గంజాయిని, టాటా ఇండికా కారులో అక్రమ రవాణకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ వెల్లడించారు. ఎస్.కోట పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఎస్.కోట సిఐ వి.ఎన్. మూర్తి ఆధ్వర్యంలో ఎస్ఐ ఎల్.చంద్ర శేఖర్ మరియు పోలీసు సిబ్బంది మార్చి 12న బొడ్డవర చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఈ తనిఖీల్లో అరకు వైపు నుండి వచ్చిన డబ్ల్యుబి 06జి 1206 నంబరుగల టాటా ఇండిగో కారులో ఐదుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారని, తనిఖీల్లో భాగంగా కారు డిక్కీ తెరిచి చూడగా, డిక్కీలో బ్రౌను కలరు టేపులు చుట్టిన 56 గంజాయి ప్యాకెట్లు (70.1కిలోలు) పట్టుబడ్డాయన్నారు. నిందితులను, గంజాయిని రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేసి, పట్టుబడిన నిందితులను ఎస్.కోట పోలీసులు విచారణ చేయగా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయిని ప్రాంతానికి చెందిన షా ఆలం (ఎ-3), బెంగుళూరు ప్రాంతానికి చెందిన షేక్ అజాజ్ (ఎ-4)లు దుప్పట్ల వ్యాపారం చేస్తూ, వ్యాపారం చేస్తూ అక్కడ ఒడిస్సా రాష్ట్రంకు మల్కనగిరి కి చెందిన రంజిత్ బిస్వాస్ (ఎ-1), నిఖిల్ తపాలి, బిశ్వజిత్ మహల్దార్ (ఎ-5)లో పరిచయం ఏర్పడిందన్నారు. నిందితులు ఎ-1 నుండి ఎ-5 ఉత్తర భారత రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణ చేస్తూ, డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో డబ్ల్యుబి 06జి 1206 నంబరు గల టాటా ఇండిగో కారులో ఉత్తర భారత రాష్ట్రాలకు తరలిస్తుండగా మార్చి 12న బొడ్డవర చెక్ పోస్టు వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఐదుగురు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. నిందితుల వద్ద నుండి 70.1కిలోల గంజాయి, కారు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.20,300/-ల నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణలో సమర్ధవంతంగా పని చేసిన ఎస్.కోట సిఐ వి.ఎన్.మూర్తి, ఎస్ఐ చంద్రశేఖర్ మరియు ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు. మీడియా సమావేశంలో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట ఇన్స్పెక్టరు వి.నారాయణమూర్తి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం నెంబర్ 5 పట్టాలపై సుమారు 25-30 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తుతెలియని మృతదేహం బుధవారం గుర్తించినట్లు జి ఆర్ పి హెచ్ సి అశోక్ తెలిపారు. సుమారు 5 అడుగుల 6 అంగుళల పొడవు ఎత్తు,చామన ఛాయరంగు,లేత నీలం రంగు కల్గిన ఫుల్ హాండ్స్ షర్ట్ మరియు ముదురు నీలం రంగు ప్యాంటూ మృతుడి శరీరంపై ఉన్నాయి.ఆచూకీ తెలిసినవారు 9490617089, 0891-2883218 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని జిఆర్పి పోలీసులు తెలిపారు.

ఎంపిపి స్కూల్‌ను ఎంఈఓ పరిశీలన

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో వి.చిన్నయ్యపేట ఎంపిపి స్కూల్‌ను బుధవారం ఎమ్ఈఓ జే.త్రినాధరావు పరిశీలించారు. స్కూల్‌లో అసెంబ్లీ ను, విద్యార్థుల హాజరు పట్టికను, చదవడం మరియు రాయడం నైపుణ్యంను, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పధకం ను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లను, త్రాగునీటి సదుపాయాన్ని, వర్క్ బుక్స్ కరెక్షన్ ను, రికార్డ్లను మరియు తదితర అంశాలను పరిశీలించారు అని ఎంఈఓ జే. త్రినాదరావు విలేకర్ల తో తెలిపారు.

రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : విజయనగరం మండలం పరిధిలో 23 రెవెన్యూ గ్రామాలలో గత వైసిపి ప్రభుత్వం హయాంలో 8 గ్రామాలలో భూసర్వే చేయడం జరిగిందని, సదరు సర్వేలో అనేక తప్పులు జరిగాయని బుధవారం శాసనసభలో పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సదరు తప్పులను సరిదిద్దుటకు చర్యలు తీసుకుంటున్నారని, ఆయా గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసే దిశగా భూ సరిహద్దులను సరిదిద్దే ప్రయత్నం చేయడం శుభసూచికమన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో చేసిన భూసర్వేలో 8 రెవెన్యూ గ్రామాలలో సర్వే చేసారని, వాటిలో జొన్నవలస, రాకోడు, పినవేమలి, సారిక, చెల్లూరు, ద్వారపూడి, దుప్పాడ, సిరియాలపేట రెవెన్యూ గ్రామాలలో సర్వే సక్రమంగా చేయకపోవడం వలన రైతుల భూ సరిహద్దులు మారిపోవడం, ఒకరి భూమి మరొకరి పేరు మీద తప్పుగా నమోదు కావడం వంటి అనేక గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని, దీనివలన వారంతా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సదరు 8 రెవెన్యూ గ్రామాలలో కూడా మళ్ళీ భూ రీ సర్వే చేసి సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం గ్రామ స్థాయిలో భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో అనేక ఫిర్యాదులు వచ్చాయని, వాటిని కూడా పూర్తి స్థాయిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

అలరించిన ఎడ్ల పరుగు ప్రదర్శన... ఆకట్టుకున్న బొబ్బిలి పులి సాంఘిక నాటకం

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వెల్దాం -వీలు పర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవం మంగళ,బుధవారాల్లో వైభవోపేతంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 9 గంటల నుండి స్వామివారి పూజా కార్యక్రమంతో ప్రారంభమై బుధవారం ఉదయం10:45 నిమిషాలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు.అనంతరం మధ్యాహ్నం12 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా వెల్దాం వీలుపర్తి రాయుదుపేట చామలాదేవి అగ్రహారం దుంగాడ పెదదుంగాడ కొలుకుపాలెం తదితర గ్రామాల నుండి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం మధ్యాహ్నం 3గంటల నుండి ఏర్పాటుచేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన చూపులను ఎంతగానో అలరించాయి.ఈ పోటీలలో 9 ఎడ్ల బండ్లు పాల్గొనగా గెలుపొందిన విజేతలకు గ్రామ పెద్దలు చేతుల మీదుగా నగదు బహుమతిని అందజేశారు. అనంతరం రాత్రి 9గంటల నుంచి ప్రదర్శించిన బొబ్బిలి సింహం అనే సాంఘిక నాటకం యువతనుఉగ్రూతలూగించింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చక్కని ప్రణాళికతో చదవాలి

మండల విద్యాశాఖాధికారి బాల భాస్కరరావు

విశాలాంధ్ర-వేపాడ : విద్యార్థులు చక్కని ప్రణాళిక బద్దంగా చదవడంతో పాటు చేతి రాత కూడా బాగుండేలా విద్యార్థులకు తర్ఫీదునివ్వాలని మండల విద్యాశాఖాధికారి బాల భాస్కరరావు సూచించారు. మండలంలోని కుమ్మపల్లిలో ప్రాధమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల మేధస్సుతో పాటు చేతి రాత,లెక్కల సబ్జెక్టు, రికార్డులనుపరిశీలించారు.అనంతరం మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాటు ఎంఈఓ బాల భాస్కరరావు పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల చేతి రాత విషయంలో టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెరుగు పరచాలని ఆయన కోరారు.కాగా మండలంలోని సోంపురం,వేపాడ ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ స్కూలు కాంప్లెక్స్ సమావేశాల్లో హెచ్ఎంలు బీపీఏ రాజు, శ్రీవల్లి తొలిపలుకులు పలికారు. ఎంఈఓ నాగభూషణరావు క్లస్టర్ కాంప్లెక్స్‌లను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. సమావేశ అంశంలు పూర్తిగా తెలుసుకొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయవలసిందిగా తెలియజేశారు.

యువత పోరుకు హాజరైన కోలగట్ల

నిరసన కార్యక్రమంలో యువత నోట 'స్వామి అన్నయ్య' మాట
గతకొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న స్వామి

విశాలాంధ్ర-విజయనగరం : ఆయన రాజకీయాలలో ఫైర్‌బ్రాండ్.. ఆయనంటే యువతకు పిచ్చి ప్రేమ.. విజయనగరం నియోజకవర్గంలో అన్నయ్య అంటే ఎవరికైనా టక్కున గుర్తుకు వచ్చేది కేవలం స్వామి అన్నయ్య మాత్రమే. గతకొంతకాలంగా ఓటమి అనంతరం ఆయన రాజకీయాలకు దూరంగా మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గడుపుతున్నారు. రాష్ట్ర పార్టీ కార్యక్రమాలకు మాత్రం హాజరవుతున్నారు. ఇటీవల తాను నిమ్మిన అత్యంత సన్నిహితులు పార్టీలు మారి ఆరోపణలు చేసినా కనీసం స్పందించలేదు. కూటమి సర్కార్ దూసుకుపోతున్న నేపథ్యంలో వైసీపీ యువతకు ఆశాజీవిగా ఉన్న కోలగట్ల మౌనం అందరిలో నిరాశను కలిగిస్తోంది. ఈతరుణంలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పార్టీ ఆద్వర్యంలో తలపెట్టిన యువత పోరుకు కోలగట్ల వీరభద్రస్వామి హాజరయ్యారు. చాలా కాలం తరువాత స్వామి అన్నయ్యను చూడడంతో యువకులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. స్వామి అన్నయ్య వచ్చారు అంటూ ఒకరితో ఒకరు చెప్పుకోవడం విశాలాంధ్ర కంట పడింది. ఏది ఏమైనా పాలోయింగ్ ఉన్న నేతగా స్వామి తిరిగి తన రాజకీయ ముద్రను కొనసాగించాలని నియోజకవర్గ నేతలు, యువకులు కోరుతున్నారు.

సీతంలో నూతన ఇ-యంత్ర రోబోటిక్స్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం కళాశాలలో ఐఐటీ-బొంబాయి వారి సహకారంతో ఇ.సి.ఇ విభాగంలో ఇ-యంత్ర రోబోటిక్స్ సెంటర్ ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవడానికి రోబోటిక్స్ సెంటర్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ రోబోటిక్స్ సెంటర్ ముఖ్య ఉద్దేశం ఎంబెడెడ్ సిస్టమ్స్ మరియు రోబోటిక్స్‌లో స్టూడెంట్స్‌కి ఆచరణాత్మక అనుభవాన్ని పెపొందించేందుకు సహాయపడుతుందని, విద్యార్థులకు ప్రత్యేకమైన అవకాశాలను అందిస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఐఐటీ-బొంబాయి వారు నిర్వహించిన పరీక్ష లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశి భూషణ రావు మాట్లాడుతూ ,గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు తమ స్వంత స్టార్టప్ లను ప్రారంభించడానికి ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పొందడానికి , పరిశ్రమలలో డిమాండ్ కు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలను రోబోటిక్స్ సెంటర్‌లో ఆవిష్కరించి అమలు చేయవచ్చునని తెలిపారు. కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ డి.వి.రామమూర్తి మాట్లాడుతూ, విద్యార్థి తన విద్యా లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఇ-యంత్ర ఆలోచనలు, ఇ-యంత్ర ల్యాబ్ సెటప్ ఇనిషియేటివ్ (ఇ.ఎల్.ఎస్.ఐ)లను సమర్థవంతంగా నిర్వహిస్తుందని, అలాగే విద్యాసంస్థలు, పరిశ్రమలు మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఇ -యంత్ర రోబోటిక్స్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని దానిని విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇ.సి.ఇ విభాగాధిపతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.డి.వి.ఎ. నాయుడు, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూములు రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రెవిన్యూ డివిజనల్ అధికారి జే వి ఎస్ ఎస్ రామ్మోహన్ రావు

విశాలాంధ్ర-బొబ్బిలి : రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెవెన్యూ శాఖ ద్వారా రైతు భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి జే వి ఎస్ ఎస్ రామ్మోహన్ రావు పిలుపునిచ్చారు. బుధవారం మండలం అలజంగి గ్రామంలో భూములు రి సర్వే కార్యక్రమం పై రైతులతో చేపట్టిన అవగాహన ర్యాలీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం శ్రీను, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్ కుమార్, రీ సర్వేడిటీ శివుని నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ లోన్స్‌కి 22లోగా దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో ప్రభుత్వం వారు కల్పించినటువంటి బి సి కార్పొరేషన్ లోన్స్‌కి మండలంలో గల అర్హత గల సభ్యులు మీకు అందుబాటులో వున్న సచివాయాలయంలో గాని, మీసేవలో గాని లేదా ఆన్లైన్లో గాని తేది. 12.03.2025 నుండి తేది.22.03.2025 లోపు అప్లై చేసుకుని లబ్ది పొందగలరని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్. రాంబాబు తెలియజేసారు.

12, 13 తేదీల్లో జాతీయ సాంకేతిక సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జె.ఎన్.టి.యు గురజాడ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న సెన్స్ -2 కె 25 అను జాతీయ సాంకేతిక సదస్సు 12, 13 తేదీలలో నిర్వహిస్తున్నట్లు విభాగ అధిపతి పి.అరుణకుమారి తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ఉపకులపతి ఆచార్య డి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా విద్యార్థులు నూతన సాంకేతిక ఒరవడిని అలవరచుకొని విజ్ఞానాన్ని విజ్ఞతతో వాడాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రధానాచార్యులు డా.ఆర్.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా విద్యార్థులు ఒక నూతన సాంకేతిక నిపు?ణతను అందిపుచ్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి గ్రూప్ కెప్టెన్ పోలా ఆనంద్ నాయుడు గౌరవ అతిథిగా విచ్చేసి విద్యార్థులను తమ ప్రసంగం ద్వారా ఉత్తేజితులను చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుండి సుమారు 350 మంది విద్యార్థులు సైబర్ థ్రెట్ ఇంటెలిజెన్స్, ప్రాక్టికల్ మెషీన్ లెర్నింగ్ కార్యసాలలో పాల్గొన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విభాగ సమన్వయ కర్తలుగా డా. ఆర్ డి డి శివరాం, వి నారాయణరావు, విద్యార్థి సమన్వయకర్తలుగా వుజ్జి తనూజ్ హేమంత్, పెడాడ బలాశ్రీ వ్యవహరించారు.

పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు గుడ్‌న్యూస్. 2024- 25 విద్యా సంవత్సరంలో మార్చి- 18వ తేదీ నుండి జరగబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల కొరకు హాజరయ్యే విద్యార్థులకు వారి గృహము నుండి పరీక్ష కేంద్రం వరకు పరీక్ష జరుగుతున్న తేదీలలో ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణము కల్పిస్తున్నామని. జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ తెలిపారు . కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని పరీక్షలకు సకాలంలో హాజరై పరీక్షలను బాగా రాయవలసిందిగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ జయప్రదం చేయండి

మండల జనసేన పార్టీ అధ్యక్షురాలు రౌతు కృష్ణవేణి

విశాలాంధ్ర- మెరకముడిదాం : పిఠాపురంలో ఈనెల 14న తలపెట్టనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాల్సిందిగా మండల జనసేన పార్టీ అధ్యక్షురాలు రౌతు కృష్ణవేణి నాయుడు కోరారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ మార్చి 14 శుక్రవారం 11వ జనసేన ఆవిర్భావ దినోత్సవం వేడుకలను చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలో ఉన్న మండల బాధ్యులు, నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఆవిర్భావ దినోత్సవ జయప్రదం చేద్దామని సమావేశం ద్వారా మెరకముడిదాం మండల జనసేన అధ్యక్షురాలు రౌతు కృష్ణవేణి నాయుడు తెలిపారు.

జనసేన పార్టీ ఆవిర్భావ సభకు వంద వాహనాల్లో బయల్దేరనున్న నాయకులు

విశాలాంధ్ర-భోగాపురం : జనసేన పార్టీ ఆవిర్భావ సభకు మండలం నుంచి వంద వాహనాల్లో బయలుదేరి వెళ్తున్నామని జనసేన పార్టీ సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని నాయకులతో ఆయన కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు సభకు వెళ్లేలా చూడాలని శ్రీనివాసరాజు అన్నారు. అనంతర ఆవిర్భావ సభకు సంబంధించిన పోస్టర్ ను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే లోకం మాధవి ఆధ్వర్యంలో మండలం నుంచి భారీ ఎత్తున ఆవిర్భావ సభకు వెళుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గం నుంచి సుమారు 2000 మంది వెళ్తున్నారని అన్నారు. భోగాపురం మండలంలోని నాయకులందరూ శుక్రవారం ఉదయాన్నే భోగాపురం పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరుతున్నారని తెలిపారు. నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, వందనాల రమణ, మైలపల్లి అప్పలకొండ, నరసింహులు, చెల్లుబోయిన రాము, కర్రోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిబిఎం గర్ల్స్ హైస్కూల్ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్‌పై

ఎమ్మెల్యే బేబీ నాయన అసెంబ్లీలో ప్రస్తావించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు తీర్మానం

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణంలో ఉన్నటువంటి వందేళ్ళ చరిత్ర కలిగిన సిబిఎం గర్ల్స్ స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్ అలాగే గుర్తింపు రెన్యువల్ విషయంలో ఇప్పుడు జరుగుతున్నటు వంటి అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే బేబీ నాయన ప్రస్తావన చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాలతో పట్టణంలో ఉన్న కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి రవికుమార్. ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసపు సాయి కిరణ్ యాదవ్. అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కోట అప్పన్న లు మాట్లాడుతూ సిబిఎం హై స్కూల్ పరిరక్షణ కోసం విద్యార్థి యువజన సంఘాలు ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని. స్కూల్ కరస్పాండెంట్ అయినటువంటి రత్నకుమార్ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి స్కూల్ గుర్తింపుతో సక్రమంగా నడుస్తున్న సమయంలో అప్పటి వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నేత తూముల భాస్కరరావుకు నిబంధనలకు విరుద్ధంగా హైకోర్టులో కేసులు పెండింగ్లో ఉండగా రెవెన్యూ అమ్మకాలు చేయడం ముమ్మాటికీ దుర్మార్గమని ఆరోపించారు. సిబిఎం స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు అయ్యేంతవరకు. స్కూల్ రెన్యువల్ కొరకు భవిష్యత్తులో దశల వారి పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బొబ్బిలిలో ఘనమైన చరిత్ర కలిగినటువంటి సిబిఎం స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్. స్కూల్ గుర్తింపు రెన్యువల్ కొరకు ఎమ్మెల్యే బేబీ నాయన ప్రత్యేక చొరవ తీసుకొని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పి.పి. మోడల్‌లో పర్యటకాభివృద్ధికి ముందుకు రావాలి

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : జిల్లాలో పర్యాటకాభివృద్ధికి పి పి మోడల్‌లో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చే వారికి అవసరమగు భూమి, ఇతర అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, ఔత్సాహికులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ పిలుపునిచ్చారు. జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, బీచ్ టూరిజం, టెంపుల్ టూరిజం, క్రింద ఎవరైనా ముందుకు వస్తే మంచి లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి పర్యాటక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనేక పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రతిపాదనలు చేయడం జరిగిందని, వాటిలో ప్రధానంగా గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి రిజర్వాయర్ వద్ద ఎకో టూరిజం అభివృద్ధి కోసం 23 కోట్ల తో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఇందులో రోప్ వే, చిల్డ్రెన్ పార్క్, బర్డ్స్ పార్క్, రెస్టారెంట్, క్లబ్ హౌస్, ఓపెన్ ఎయిర్ ఆంఫీ థియేటర్ తదితర పనుల కోసం 10.63 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. టెంపుల్ టూరిజం క్రింద రామతీర్థం దేవాలయం వద్ద అభివృద్ధి జోసం 10 కోట్ల తో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. కొండపైకి రహదారి మార్గం, రామతీర్థం గుడి నుండి కొండ పైకి రోప్ వే, మ్యూజియం నిర్మాణానికి, లైటింగ్, కాఫ్టేరియా, రెస్ట్ రూమ్స్ , కోనేరు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. అదే విధంగా రామనారాయణం వద్ద నున్న గోపాల రాజు కోనేరు అభివృద్ధికి 8.50 ఎకరాల విస్తీర్ణం లో 6 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఈచెరువును వి.ఎం.ఆర్.డి.ఏ ద్వారా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. చింతపల్లి బీచ్ టూరిజం క్రింద 6 కోట్ల రూపాయలతో కాటేజ్‌ల నిర్మాణాలు, ల్యాండ్ స్కేపింగ్, రెస్టారెంట్, రోడ్ తదితర అభివృద్ధి పనులను చేయడం జరుగుతుందన్నారు. ఇవే కాకుండా జిల్లా లో ఉన్న పలు ప్రాంతాలను సందర్శించి పర్యాటకాభివృద్ధికి అనుకూలంగా ఉన్న వాటిని పిపి మోడల్‌లో అభివృద్ధి చేయడానికి, ముందుకు వచ్చే భాగస్వామ్యులకు ప్రోత్సహించి , కౌన్సిల్ ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి కుమార స్వామి, పి.డి. డి.ఆర్.డి.ఏ కళ్యాణ చక్రవర్తి, ఎండోమెంట్ ఉప కమీషనర్, హెూటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస రావు, అటవీ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తడి నేలల పరిరక్షణకు కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : జిల్లాలో చెరువులు, కాలువలు తదితర జలావాసాలు, తడి నేలల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. దీనికోసం ముందుగా చెరువులు తదితర జలవనరుల సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. జిల్లా తడి నేలల (వెట్ ల్యాండ్స్) కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది.కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ముందుగా జిల్లాలో చెరువులు, కాలువలు తదితర తడి నేలలను సర్వే చేసి జాబితా తయారు చేయాలని సూచించారు. ఇరిగేషన్, రెవెన్యూ రికార్డులతోపాటు ఇతర రికార్డులును కూడా పరిశీలించి జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా జిల్లాలో 2,263 తడి నేలలను గుర్తించడం జరిగిందని, వీటిలో 2,191 నేలలకు గ్రౌండ్ ట్రూతింగ్ కూడా పూర్తి అయ్యిందని చెప్పారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో వందలాది చెరువులు ఉన్నాయని, అలాగే మంచినీటి చెరువులు కూడా చాలాచోట్ల ఉన్నాయని చెప్పారు. అందువల్ల సమగ్ర సర్వే నిర్వహించిన తరువాతే, జలావాసాలను, తడి నేలలను ఖరారు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనికోసం మండల స్థాయిల్లో ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయితీ, సర్వే, వ్యవసాయ, ప్రజారోగ్య, మత్స్య, పశు సంవర్ధక శాఖాధికారులు సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి, ఈ నెల 15లోగా జాబితాలను రూపొందించాలని ఆదేశించారు. కాలుష్యానికి, నిర్లక్ష్యానికి గురైన చెరువులు, ఇతర జలావాసాల పరిరక్షణకు సమగ్ర ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. ముందుగా జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జలావాసాలు, తడి నేలలను సంరక్షించాల్సి ఉందని అన్నారు. దీనికోసం వివిధ శాఖల సహకారంతో, అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ వైవి రమణ, ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, పబ్లిక్ హెల్త్ ఈఈ జ్యోతి, పర్యాటక శాఖాధికారి కుమారస్వామి, సర్వే ఏడి రమణమూర్తి, వ్యవసాయశాఖ ఎడి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాల, మొండి బకాయిలను రాబట్టిన రెవెన్యూ సిబ్బంది

విశాలాంధ్ర-విజయనగరం : దీర్ఘకాల, మొండి బకాయిలను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో సహాయ కమిషనర్ కే అప్పలరాజు నేతృత్వంలోని రెవెన్యూ సిబ్బంది రాబట్టారు. పెద్ద మొత్తంలో పేరుకుపోయిన ఆస్తి పన్నులను వసూలు చేసే నిమిత్తం నగరంలోని పలు దుకాణాల వద్దకు వెళ్లి తక్షణమే పన్నులు చెల్లించాలని పట్టుపట్టారు. దీంతో పన్ను బకాయిదారులు కొంతమంది నగదును చెల్లించగా, మరి కొంతమంది చెక్కుల రూపంలో బకాయిలను అందజేసారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో పాటు జప్తు వాహనాన్ని కూడా తీసుకుని వెళ్లి ఆయా బకాయిదారులను పన్ను చెల్లించాల్సిందేనని కోరుతున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజలు తమ యొక్క ఆస్తి పన్నులు, ఖాళీ స్థలముల పన్నులు, నీటి చార్జీలను వెంటనే చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని విజయనగరం నగరపాలక సంస్థ చేశారు. శతశాతం పన్ను వసూలే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పన్నులు చెల్లించని వారు వడ్డీ భారం కూడా భరించాల్సి వస్తుందన్నారు. పన్నులు చెల్లింపులకు వసూలుబాటు నిమిత్తం ఒక ఆర్థిక సంవత్సరాన్ని నాలుగు త్రై మాసికాలుగా విభజించడం జరిగిందన్నారు. అయినా గాని చాలామంది పన్నులు చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలు చెల్లించిన పన్నులతోనే నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. న్యాయబద్ధంగా ప్రతి ఒక్క ఆస్తిదారుడు విధిగా నగరపాలక సంస్థకు పన్నులు చెల్లించాల్సిందేనని అన్నారు. లేని పక్షంలో ఇళ్ల కులాయి కనెక్షన్లను, కరెంటు కనెక్షన్లను నిర్ధ్వందంగా తొలగించి వేస్తామని స్పష్టం చేశారు. పన్నులను విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గాని, సచివాలయాలలో గాని నేరుగా చెల్లించవచ్చన్నారు. లేదా వాట్సాప్ ఆన్లైన్లో గాని చెల్లించే అవకాశం ఉందన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద పన్నులు చెల్లింపు కోసం మరో ప్రత్యేక కౌంటర్ ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సోంపురంలో 13, 14, 15వ తేదీలలో శ్రీముత్యాలమ్మ తల్లి 68వ తీర్థ మహోత్సవం

- మూడురోజులపాటుసాంస్కృతిక,గుర్రాల,ఎడ్ల పరుగు పోటీలు
- ప్రత్యేక ఆకర్షణగా తీన్మార్,మహిళా కోలాటం, సంగిడీరాళ్ళ పోటీలు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని సోంపురం గ్రామ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న శ్రీముత్యాలమ్మ తల్లి 68వ తీర్థ మహెూత్సవం 13, 14, 15 తేదీల్లో వైభవంగా జరిపేందుకు పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 6గంటల నుంచి అమ్మవారికి పసుపు కుంకుమ పూజలతో ప్రారంభం జరుగుతుంది.మొదటి రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి బండ్ల వేషములు, చిడతలు, తోడపెద్దులు, చిత్ర, విచిత్ర వేష ధారణలతో జనరంజకంగా తీర్థ మహెూత్సవం ప్రారంభమవుతుంది. అలాగే మధ్యాహ్నం 3గంటల నుంచి తీన్మార్,మహిళా కోలాటం, సంగిడీ రాళ్ల పోటీలు, బాణసంచా కాల్పులు జరుగుతాయి. అదేరోజు రాత్రి 8గంటలకు డ్యాన్స్ బేబి డ్యాన్స్ నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. అలాగే 14న మధ్యాహ్నం 3గంటలకు గుర్రాల పరుగు ప్రదర్శన, సాయింత్రం 4గంటల నుంచి బాలనాగమ్మ బుర్రకథ ప్రదర్శన జరుగుతుంది. రాత్రి 8గంటల నుంచి డ్యాన్స్ బేబి డ్యాన్స్ నృత్య ప్రదర్శనలు జరుతాయి. అలాగే 15వ తేదిన మధ్యాహ్నం 3గంటల నుంచి ఎడ్ల పరుగు పందాలు జరుగుతాయి. అదే రోజు సాయంత్రం 4గంటల నుంచి బొబ్బిలి బుర్రకథ ప్రదర్శన, అదేరోజు రాత్రి 8గంటలకు శ్రీరామాంజనేయ యుద్ధం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. నేటికి 68ఏళ్ల నుంచి నిర్విరామంగా, సమిష్టిగా, ఘనంగా తీర్థ మహెూత్సవం జరిపించడంలో మార్గదర్శకంగా నిలిచిన స్వర్గీయ జాగరపు రామునాయుడు అడుగు జాడల్లో మమ్ములను నడిపించాలని కోరుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

వైకాపా నాయకుడిని పరామర్శ

విశాలాంధ్ర-రాజాం : మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటకు చెందిన వైకాపా నాయకుడు పిట్టా జగదీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సమాచారం తెలుసుకుని వైకాపా టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు పరామర్శించారు.

ఆయన వెంటనే కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు పలువురు వైకాపా నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ చెరువు ఆక్రమణపై చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం, మూడో వార్డుకు చెందిన స్మశాన వాటిక, టీ,బి,ఆర్, సినిమా థియేటర్ వెనుక ఉన్న చెరువును కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమణ చేస్తున్నారు. రాత్రి వేళల్లో చెరువును కప్పివేస్తూ వారి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని రెవెన్యూ , పురపాలక అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని స్థానిక ప్రజలు అధికారులు తీరుపై తీవ్రంగా ఆరోపిస్తున్నారు. మూడో వార్డు కు చెందిన స్మశాన వాటిక వెనుక ఉన్న చెరువు, టిబిఆర్ సినిమా థియేటర్ వెనుక ఆనుకొని ఉన్న ఈ చెరువును రాత్రి వేళల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు జెసిబిలను పెట్టి పెద్ద టిప్పర్లతో రద్దు తెప్పించి చెరువును కప్పి వేస్తున్నారని అని స్థానికులు చెబుతున్నారు. ఇలా రాత్రి వేళల్లో ప్రభుత్వ చర్యలను ఆక్రమణ చేస్తుంటే సంబంధిత శాఖ అధికారులు ఎందుకు మౌనంగా వహిస్తున్నరని అంత అక్షరమా చర్యలు చేపట్టాలని ప్రజల కోరారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించే దిశగా అవగాహన కల్పించాలి

వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : జిల్లాలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో మూడో శనివారం నాడు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిరోధించే అంశంపై ప్రజల్లో అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ జిల్లా అధికారులు, ఎంపిడిఓలు,తహశీల్దార్‌లను ఆదేశించారు. అదేవిధంగా ఒకసారి వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్ల వంటి వస్తువులను మళ్లీ ఏవిధంగా వినియోగించవచ్చో తెలియజేసేలా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే హాని గురించి తెలియజేస్తూ ప్లాస్టిక్ వస్తువులు మళ్లీ మళ్లీ గృహావసరాలకు ఎలా వినియోగించాలో తెలియజేసేలా మునిసిపాలిటీలు, మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు చేసిన పనులను సంబంధిత ఏప్‌లో అప్‌లోడ్ చేయడంపై కూడా దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని మండల అధికారులు, ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర, ఇళ్ల నిర్మాణానికి అదనపు సహాయం మంజూరుపై లబ్దిదారులకు అవగాహన కల్పించడం, నాటుసారా నిర్మూలనకు నవోదయం, జలవనరుల గుర్తింపు తదతర అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం పి.ఎం.ఏ.వై., పి.ఎం.జన్‌మన్ పథకాల లబ్దిదారులకు ఇళ్ల నిర్మాణానికి అదనపు మంజూరు చేసిన విషయాన్ని ఆయా లబ్దిదారులకు గురువారం నాటికే తెలియజేయాలని ఆదేశించారు. ఆయా మండలాల్లో ప్రత్యేక అధికారులు గురువారం సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణానికి అదనపు సహాయం మంజూరైన వారిని గుర్తించడం, వారు ఇళ్ల నిర్మాణం పూర్తిచేయడానికి అవసరమైన సహకారం అందించడంపై సమీక్షించాలన్నారు. జూన్ నెలాఖరుకు స్లాబు స్థాయిలో వున్న 11 వేలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.నవోదయం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాటుసారా నిర్మూలనకోసం గ్రామ, మండల స్థాయిలో కమిటీలు వేసి నాటుసారా తయారీ, సరఫరా జరుగుతున్న గ్రామాలను గుర్తించాలన్నారు. నాటుసారా రహిత జిల్లాగా రూపొందించడంలో అందరి సహకారం తీసుకోవాలన్నారు. జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా వేసవిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో అగ్నిప్రమాద ఘటనలు జరిగేటపుడు తక్షణం స్పందించేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో వర్క్ ఫ్రమ్ హెూమ్ సర్వే నిదానంగా జరుగుతోందని, వేగవంతం చేయాలని ఆదేశించారు. పేదరికంపై చేపట్టిన పి4 సర్వే కూడా వేగవంతం చేయాలని చెప్పారు. ఈ సర్వేలో ఏ.ఎన్.ఎం. మినహా ఎవరికీ మినహాయింపు లేదని వి.ఆర్.ఓ. సహా అందరూ ఈ సర్వేలో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. ఈసర్వేలో పాల్గొనని సిబ్బందిపై చర్యలు చేపడతామని, తనకు నివేదించాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి ఉషారాణిని ఆదేశించారు. వి.సి.లో సిపిఓ పి.బాలాజీ, మునిసిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, జెడ్పీ డిప్యూటీ సి.ఇ.ఓ. వెంకటరామన్, డిపిఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా మార్చాలి

ఫిర్యాదులకోసం టోల్‌ఫ్రీ నెంబరు 14405

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. నాటు సారాకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 14405కు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఎపి ప్రభుత్వ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో నాటుసారా నిర్మూలన సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తమ గ్రామంలో ఎక్కడా సారా తయారీ గానీ, వినియోగం గానీ జరగడం లేదని అన్ని గ్రామాల్లో పంచాయితీ తీర్మాణాలను తీసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసిన తరువాత, ఇప్పటికే సారా తయారీ, వినియోగం జరుగుతున్నట్లు గుర్తించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, అదుపు చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అబ్కారీ శాఖతోపాటు పోలీసులు, అటవీశాఖ కూడా నాటు సారా తయారీపై నిఘా పెంచాలని సూచించారు. అటవీ ప్రాంతంలో ఎక్కడైనా సారా తయారీ జరిగితే, దానికి అటవీశాఖదే బాధ్యత అని స్పష్టం చేశారు. అటవీ, పోలీసు, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా విస్తృతంగా తనిఖీలను నిర్వహించాలని ఆదేశించారు. అలాగే నాటుసారా తయారీదార్లపై ఉన్న కఠిన శిక్షలు, వినియోగించే వారికి కలిగే అనర్ధాలను వివరిస్తూ గ్రామస్థాయిలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను అవగాహన కలిగించి, వారి ద్వారా తల్లితండ్రులకు చైతన్యం కలిగించాలని చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా గ్రామాల్లో వీటివల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రచారం చేయించాలన్నారు. జిల్లాను సారా రహితంగా మార్చడంలో అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కోరారు. నవోదయం 2.0 కు సంబంధించిన గోడపత్రికలను, స్టిక్కర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రచార రథాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఎక్సైజ్ సహాయ కమిషనర్ పి.రామచంద్రరావు మాట్లాడుతూ, జిల్లాలో నవోదయం కార్యక్రమం అమలు, నాటుసారా తయారీ తదితర అంశాలను వివరించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సూపరింటిండెంట్ బి.శ్రీనాధుడు, అటవీశాఖాధికారి కొండలరావు, డిఈఓ మాణిక్యంనాయుడు, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిఆర్‌డిఏ ఏపిడి సావిత్రి, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకుంటూ... ఆవిర్భావ సభకు సమాయత్తం చేస్తూ..

అలుపెరగకుండా కష్టపడుతున్న జనసేన ఎమ్మెల్యే మాధవమ్మ

విశాలాంధ్ర-విజయనగరం : ఆమె నెల్లిమర్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. కేవలం తన నియోజకవర్గం మాత్రమే కాకుండా జిల్లా వ్యాప్తంగా పార్టీబలోపేతానికి తనవంతు శాయశక్తులా కృషి చేస్తున్నారు. అందరినీ కలుపుకుంటూ, కలుసుకుంటూ ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేసేందుకు అలుపెరగకుండా కృషి చేస్తున్నారు. ఆమె.. లోకం నాగ మాధవి. నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆప్యాయతతో పిలుచుకునే పేరు మాత్రం మాధవమ్మ. ప్రస్తుతం జిల్లాలో అధ్యక్షుడు లేకపోవడంతో ముఖ్యంగా జిల్లాలో ఉన్న జనసేన ఎమ్మెల్యే మాధవమ్మపై ఎక్కువ భారం పడుతోంది. ఇప్పటికే జనసేన పార్టీకి వైసీపీ నుంచి వలసలు భారీ ఉన్నాయి. మండల స్థాయి నేతలు సైతం మాధవమ్మకు మద్దతుగా వెళ్ళిపోతున్నారు. దీంతో నెల్లిమర్ల నియోజకవర్గం గతం కంటే ఇప్పుడు జనసేన పటిష్టంగా మారింది. ఒకవైపు కూటమి ధర్మం పాటిస్తూ మరోవైపు జనసేనను బలోపేతం చేయడంలో ఆమె వ్యూహాత్మంగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా వుండగా ఈనెల 14న పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలో జరగబోయే పార్టీ ఆవిర్భావ సభకు జిల్లానుంచి అధిక సంఖ్యలో తరలించేందుకు విశేష కృషి చేస్తున్నారు. అందులో భాగంగా నియోజకవర్గం లోని అన్ని మండలాలనుంచి వందలాదిగా కార్లును సిద్ధం చేస్తున్నారు. ఇక జిల్లా కేంద్రంలోనూ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి సమాయత్తం చేసారు. అందరితో కలిసి రాకపోకల కార్యచరణ రూపొందించారు. కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లును ఆమెతో పాటు ఆమె భర్త జనసేన సీనియర్ నేత లోకం ప్రసాద్‌లు స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారు. ఆమె చేస్తున్న కృషి ఫలితంగా రాబోయే రోజులలో జనసేన జిల్లాలో మరింత పటిష్టంగా మారుతుందని పలువురు భావిస్తున్నారు.

విభజన హామీలను అమలుచేయాలి

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : రాష్ట్రంలో ఉన్న ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు రాష్ట్ర భవిష్యత్ కోసం ఆలోచిస్తూ ప్రత్యేక హెూదాను డిమాండ్ చేయాల్సిన అవసరం చాలా ఉందని ఆలిండియా జైహింద్ పార్టీ, సమాజ్వాది పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విజయనగరం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపకులు ఎన్. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాలు కోసం అప్పట్లో తెలుగు ప్రజలను రెండుగా చీల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హెూదా ఇస్తామని అప్పటి మన్మోహన్ సింగ్ కేంద్ర ప్రభుత్వం మాట ఇచ్చిందని, అందుకోసం తీర్మాణాలు కూడా చేసిందన్నారు. అయితే ఆ తరువాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వకం హామీలను తుంగలోకి తొక్కిందన్నారు. అయినప్పటికీ ఇప్పటి అధికార పార్టీ, గత ప్రభుత్వమైనా కేంద్ర ప్రభుత్వాన్ని కనీసం ప్రశ్నించలేకపోయరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కేంద్రంలో ప్రభుత్వం నిలబడిందంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు వేసిన ఓట్లుతో భారీ మెజార్టీతో గెలిచిన కూటమి ప్రభుత్వం కారణమని. ఆ విషయం కేంద్ర పెద్దలు తెలుసుకోవాలన్నారు. విభజన హామీలు అమలు కోసం అన్నీ రాజకీయ, ప్రజా పక్షాలు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకోసం అవసరమైన కార్యచరణ రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు, సమాజ్వాదీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రి రాజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షమించండి... శాఖలో తప్పులు సరిదిద్దుతా : ఎస్బిఐ ఏజీఎం ఎం.సురేష్‌కుమార్

విశాలాంధ్ర-చీపురుపల్లి : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీపురుపల్లి శాఖలో వినియోగదారులకు ఇబ్బందులను భవిష్యత్తులో జరగకుండా తప్పులు సరిదిద్దం క్షమించండి అంటూ ఆ శాఖ ఏజీఎం ఎం సురేష్ కుమార్ బ్యాంకు ఖాతాదారులకు క్షమాపణ చెప్పారు. చీపురుపల్లి స్టేట్ బ్యాంక్ శాఖలో ఒకరు ఇద్దరు ఉద్యోగులు మినహా మిగిలిన వారంతా బ్రాంచ్ మేనేజర్ తో కలుపుకొని వినియోగదారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ పలువురు స్టేట్ బ్యాంక్ శాఖ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం సాయంత్రం చీపురుపల్లి శాఖలో ఖాతాదారులతో పాటు ఉద్యోగులను కూడా సమావేశపరిచి ఏటీఎం వినియోగదారుల సమస్యలు తెలుసుకున్నారు. వినియోగదారులు ఒక్కొక్కరిగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏజీఎం దృష్టికి తీసుకువచ్చారు. వినియోగదారులంటే కనీస గౌరవం లేకుండా బ్యాంకు ఉద్యోగుల అవమాన పరుస్తున్నారంటూ, ఒక్క నిమిషం లేటయినా పని పూర్తి చేయడానికి నాన్న తిప్పలు పెడుతున్నారు వివరించారు. ఈ సందర్భంగా ఏజీఎం ఖాతాదారులతో మాట్లాడుతూ బ్యాంకులో ఏజీఎం స్థాయిలో ఉన్నప్పటికీ చీపురుపల్లి శాఖకు సంబంధించి భవిష్యత్తులో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా బ్యాంక్ మేనేజర్ సాయి ఉద్యోగాన్ని కూడా తన బాధ్యతగా తీసుకుంటానని వినియోగదారులకు వివరించారు. ఏడాదికాలంగా చీపురుపల్లి శాఖలో వినియోగ దారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా చీపురుపల్లి శాఖ ఉద్యోగులను ఆయన మంద లించారు. భవిష్యత్తులో ఎటువంటి ఫిర్యాదులు ఉన్నా ఖాతా గారు నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ఏజీఎం ఫోన్ నెంబర్ను వినియోగదారులకు అందజేశారు. ఫిర్యాదు చేసే వినియోగదారులు కూడా చీపురుపల్లి శాఖలో ఏ ఉద్యోగి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారు పేరుతో పాటు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. బ్యాంకు వేళలను ఉద్యోగులు ఎందుకు కచ్చితంగా పాటించడం లేదని, నాలుగు గంటలకే బ్యాంకు ను ఎందుకు క్లోజ్ చేయవలసి వస్తుందని ఆయన ఉద్యోగులను ప్రశ్నించారు. వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించడంతోపాటు ఉద్యోగులంతా పనివేళల్లో వినియోగదారులకు అందుబాటులో ఉండాలని ఏజీఎం హెచ్చరించారు. చీపురుపల్లి శాఖలో ప్రతి ఖాతాదారుడికి గౌరవప్రదమైన సేవలు అందజేయకపోతే ఉద్యోగులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో చీపురుపల్లి స్టేట్ బ్యాంక్ శాఖ ఉద్యోగులతో పాటు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

కషాయాలు ఉండగా రసాయనాలు దండగా వ్యవసాయ అధికారి శిరీష

విశాలాంధ్ర,బిబాడంగి: కషాయాలు ఉండగా రసాయనాలు దండగ, నవధాన్యాలు సాగు నేలతల్లి బాబు అనే నినాదంతో మండల కేంద్రమైన బాడంగి లో ప్రకృతి వ్యవసాయంపై భారీ ర్యాలీ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల ద్వారా వ్యవసాయ సాగు చేసి భూములను కాపాడుదామని వారంతా నినాదాలు చేశారు. అదేవిధంగా ఆరుతడి పంటలైన నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూములు సారవంతం అవుతాయని విషయాన్ని రైతులకు తెలియజేశారు. రసాయనిక ఎరువులు వినియోగం వల్ల రైతులు నష్టపోవడమే కాకుండా ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని విషయాన్ని రైతులు గ్రహించాలని వారు కోరారు. వీలైన అంత మేరకు క్రిమిసంహారక మందులు వినియోగం రసాయనకి ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని విషయాన్ని రైతులు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కండి రమేష్, ఎంపిటీసి దేవరపల్లి శ్రీనివాసరావు తో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐ సి ఆర్.పి రామలక్ష్మి యూనిట్ ఇంచార్జ్ వైస్ సత్యనారాయణ తో పాటు పలువురు రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు

సెల్‌ఫోన్లకు అనుమతి లేదు : కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తూ, ఈ ఏడాది 23,765 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. వీరిలో 22,930 మంది రెగ్యులర్ విద్యార్థులు, 835 మంది ప్రయివేటు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 119 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విడతకు 1124 మంది చొప్పున రెండు విడతలకు 2248 మంది ఇన్విజిలేటర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. పర్యవేక్షణకు ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతీ సెంటర్‌కు ఒక ఛీఫ్ సూపరింటిండెంట్‌ను, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించామన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలవుతుందని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సరిపడా లైటింగ్, త్రాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో డిఈఓ మాణిక్యంనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆటో నుంచి జారిపడి ఆరోగ్య మిత్ర మృతి

విశాలాంధ్ర-బొబ్బిలి : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్య మిత్రగా విధులు నిర్వహిస్తున్న సీర గౌరీ (58) ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు ముగించుకొని సొంత గ్రామం పక్కి వెళుతుండగా మార్గమధ్యంలో పక్కి గ్రామం దరిలో ఆటో నుండి జారిపడి తలకు తీవ్రగాయం కావడంతో ఆటోలో బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్ళి పోవాలని తెలియజేయడంతో క్షతగాత్రుని సొంత గ్రామానికి తీసుకువచ్చారు. ఇంటి వద్ద గౌరీ నాయుడు మృతి చెందినట్లు మృతుడు భార్య సరస్వతి , ఇరువురు చిన్నపిల్లల కలరు. మృతుడు భార్య సరస్వతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు గౌరి మృతి చెందడంతో కుటుంబం రోడ్డును పడ్డదని ప్రభుత్వం స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

పి.ఎం.ఏ.వై. ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ అదనపు సాయం

బి.సి., ఎస్.సి.లకు రూ.50వేలు, ఎస్.టి.లకు రూ.75 వేలు : కలెక్టర్ వెల్లడి

విశాలాంధ్ర-విజయనగరం : ప్రధానమంత్రి ఆవాస్ యోజన -గ్రామీణ్, అర్బన్, పి.ఎం.జన్‌మన్ పథకాల కింద గతంలో మంజూరై నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సహాయాన్ని ప్రకటించిందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేసిన మొత్తానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం అదనపు సహాయాన్ని అందించి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతోందని చెప్పారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు ఆర్ధిక సహాయం వల్ల బి.సి.,ఎస్.సి., ఎస్.టి., పివిటిజిలకు చెందిన 15,226 మంది ఇళ్ల లబ్దిదారులకు ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 12,240 మంది బి.సి.లకు, 2,231 మంది ఎస్.సి.లకు ఒక్కో ఇంటికి రూ.50 వేల వంతున ఆర్ధిక సహాయం అందిస్తారని తెలిపారు. 565 మంది షెడ్యూల్డు తెగల వారికి రూ.75 వేల వంతున, 190 మంది ఆదిమతెగల వారికి పి.ఎం.జన్‌మన్ కింద ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ. 1.00 లక్ష వంతున ఆర్ధిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఇళ్ల లబ్దిదారులకు అదనపు ఆర్ధిక సహాయం మంజూరైన విషయాన్ని ఇంటింటికీ వెళ్లి తెలియజేయడం జరుగుతుందని, వారు తమకు మంజూరైన ఆర్ధిక సహాయం వినియోగించుకొని ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసుకోవాలన్నారు. గతంలో మంజూరై నిర్మాణంలో వున్న ఇళ్లకు మాత్రమే ఈ అదనపు ఆర్ధిక సహాయం వర్తిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఇంజనీరింగ్, సంక్షేమ కార్యదర్శులు ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాల వద్దకు వెళ్లి వాటిని ఫోటోలు తీసి హౌసింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారని చెప్పారు.

నేటి నుండి గొల్ల పేరంటాలు జాతర

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ గొల్ల పేరంటాలు అమ్మవారి 50వ జాతర మహెూత్సవాలు ఈనెల 13 నుండి నిర్వహిస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతర ఏర్పాట్లను దేవాదాయ శాఖ ఈవో బి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ వెంప డాపు రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఈనెల 13 నుండి 16 వరకు నాలుగు రోజులు పాటు జరగనున్న జాతర మహెూత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ నిర్వాహకులు అధికారులు ఏర్పాటు చేశారు. మహిమలు గల అమ్మవారిగా పేరుగాంచిన గొల్ల పేరంటాలని దర్శించుకోవడానికి విజయనగరం విశాఖపట్నం శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుండి భక్తులు తాకిడి పెరగనున్నట్లు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతర నిర్వహించనున్న నాలుగు రోజులపాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నాదెండ్లను కలిసిన విసినగిరి

విశాలాంధ్ర-చీపురుపల్లి : జనసేన పార్టీ పిఎసి సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ ని, అలాగే ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మరియు సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు కందుల దుర్గేష్ లను పిఠాపురంలో గౌరవ పూర్వకంగా కలిసి చీపురుపల్లి గ్రామ దేవత ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి చిత్రపట ప్రతిమను అందజేశారు. చీపురుపల్లి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ విసనగిరి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు..ఈ కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి విశినిగిరి శ్రీనివాసరావు గారు మరియు గుర్ల మండల పార్టీ అధ్యక్షులు యడ్ల సంతోష్, మీసాల సూరి నాయుడు, కింతల వాసుదేవరావు, కరిమజ్జి సత్య, బెవర కూర్మారావు జనసేన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురంలో ఆకట్టుకున్న సంగిడి రాళ్ల పోటీలు

విశాలాంధ్ర-భోగాపురం : భోగాపురం గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన సంగిడి రాళ్ళ పోటీలు ఆకట్టుకున్నాయి. ఇసురు, తీత, ఫోటు వంటి మూడు విభాగాలను నిర్వహించి గెలుపొందిన వారికి గ్రామ పెద్దలు కందుల రఘుబాబు చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఇసురు, తీత, పోటు ఈ మూడు విభాగాల్లో బొండపల్లి మండలం అంబటివలస చెందిన పాలూరి వెంకటేష్ మొదటి బహుమతులు సాధించాడు. అలాగే గంట్యాడ మండలం లక్కిదాం గ్రామానికి చెందిన గొల్లు కుమార్ కూడా ఈ మూడు విభాగాల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. అలాగే భోగాపురం మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన బాకీ శ్రీను తృతీయ బహుమతి సాధించాడు. ఆల్ రౌండర్ విభాగంలో ఇదే గ్రామానికి చెందిన బోర గోవిందతో సహా అందరికీ కందుల రఘుబాబు చేతుల మీదగా నగదు ప్రోత్సకాలను అందజేశారు. గ్రామ పెద్దలు కొమ్మూరు సుభాషణరావు, ఆళ్ల ఉదయ బాబు, పదాల భాను ప్రకాష్, కొమ్మూరు చిన్నదొర, వాసు బాబు, వెంకటేష్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అనునిత్యం మంచిని పంచేవాడే-నిజమైన విశ్వాసి

ఖాదర్ బాబా దర్బార్‌లో 11వ రోజు ఇఫ్తార్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అనునిత్యం మంచిని పంచే వాడే భగవంతునికి నిజమైన విశ్వాసని జగత్ ప్రవక్త ప్రవచనాన్ని సూఫీ మార్గ నిర్దేశకులు డాక్టర్ ఎం డీ ఖలీలుల్లా షరీఫ్ షా పునరుద్ఘాటించారు. పవిత్ర రంజాన్ మాస పర్వదినాన్ని పురష్కరించుకుని హుజూర్ హజరత్ సూఫీ ఆధ్యాత్మిక చక్రవర్తి బాబా సయ్యద్ ఖాదర్ అవులియా వారి దర్బార్ లో ఖాదర్ షా దర్గా దర్బార్ ముతవల్లి(ధర్మకర్త) మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ సాబిరీ(ఖలీల్ బాబు) సారధ్యంలో రంజాన్ 11వ రోజు ఇఫ్తార్ విందు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లీం సోదరులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు, బాబా భక్తులకు ఖలీల్ బాబు తనయుడు ముహమ్మద్ అహమ్మద్ బాబు ఆధ్యాత్మిక భావనతో ఇఫ్తార్ విందు వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

విశాలాంధ్ర-విజయనగరం : ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. ముఖ్యంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణా చర్యల్లో భాగంగా బుధవారం ఆయన ఆదేశాలతో సచివాలయాల వారీగా సిబ్బంది క్షేత్రస్థాయిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాలపై దృష్టి సారించారు. టిఫిన్ దుకాణాలు, కిరణా దుకాణాలు, ఇతర బడ్డీల వద్ద సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారా లేదా అని క్షేత్రస్థాయిలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. కొంతమంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించడంతో అట్టి సామాగ్రిని స్వాధీనం చేసుకొని అపరాద రుసుములను విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పర్యావరణహితాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు పరచాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనేక అనర్ధాలు భవిష్యత్తులో కలుగుతాయన్నారు. కావున ఏ ఒక్కరు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, అలాగే నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించడం కానీ వినియోగించడం గాని చేయరాదన్నారు.